క్లుప్తంగా

ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించండి



ఆలమూరులో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్లు

రుద్రవరం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య స్థితి గతులపై దృష్టి సారించాలని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యులు అమర్నాథరెడ్డి, నాగశ్రీజారెడ్డి సూచించారు. పీహెచ్‌సీలో మంగళవారం వారు వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఇంటి పరిసరాలు.కుంటలు, కాల్వలు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటూ దోమల వ్యాప్తి అధికమవుతుందన్నారు. అలాగే తాగు నీరు కలుషితం అయ్యే అవకాశముందని అన్నారు. అలాగే మలేరియా, డెంగీ, అతిసారం వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రజలు వాటి బారిన పడకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

పాఠశాలకు నీళ్ల క్యాన్ల వితరణ



హెచ్‌ఎం జీవయ్యకు క్యాన్లను అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యానికి గాను 10 ప్లాస్టిక్ నీళ్ల క్యాన్లను ఎస్టీయూ తరుపున వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు జీవయ్య తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అంజేస్తామని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్‌బాషా, కార్యదర్శి ఉస్మాన్, సీనియర్ నాయకులు సురేషప్పా, పీడీ శ్రీనాథ్‌రెడ్డి, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి, పెద్దయమ్మనూరు గ్రామ నివాసి కందూరి సుబ్బరామయ్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్ ఆధ్వర్యంలో 40 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అలాగే 4వ అంగన్‌వాడీ కేంద్రానికి టేబుల్లను తన మిత్రుడు దస్తగిరి ద్వారా అందజేశారు.

ఉపాధ్యాయులకు జాతీయ ప్రతిభా అవార్డు



అవార్డు అందుకున్న లక్ష్మీనారాయణ

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డును నంద్యాలకు చెందిన బాలా అకాడమీ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సురేష్‌బాబు అందుకున్నారని విద్యాసంస్థల చైర్మన్ మాధవీలత, రవీంద్ర మంగళవారం తెలిపారు. గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గత నెల 31న సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్, కేవీఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవార్డు అందించారని చెప్పారు.

టిడ్కో గృహాలకు దరఖాస్తు చేసుకోండి

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ఖాళీగా ఉన్న 1,019 టిడ్కో గృహాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శేషన్న తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్బీఐ కాలనీ, టిక్కో వీధుల్లో అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నంద్యాల టిడ్కో గృహాల్లో 1య019 గృహాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటి కోసం అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆయా వార్డుల్లోని సచివాలయాల్లో గృహాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

యూరియా వాడకం తగ్గించాలి

ఉయ్యాలవాడ : రైతులు పంటల సాగులో యూరియా వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని నర్సిపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో డ్రోన్ సహాయంతో సామూహిక ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. నానో యూరియా ద్వారా పంటల ఉత్పాదకత మరియు నాణ్యత పెరగడంతో పాటు నేల ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు.



కానాలలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం.



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..



యాళ్లూరులో...



నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు

చిరస్మరణీయుడు వైఎస్సార్

- ఘనంగా వైఎస్సార్ వర్ధంతి
- వాడవాడలా రాజన్న విగ్రహాలకు నివాళులు



శిల్పా నివాసంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నంద్యాల(వ్యవసాయం)/(అర్బన్)/గోస్పాడు: సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాల్లో కొలువైన, కరువు సీమను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ప్రజలు స్మరించుకున్నారు. ఆయన 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాజన్న విగ్రహాలకు పూలమాల వేసి పలువురు నివాళులర్పించారు.

వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతిని స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి పెద్దిశీను, జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు విజయశేఖర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, సుధాంశరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శరత్, ముక్కెర కృష్ణారెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో నాయకులు ఊకొట్టు వాసు, బాలకృష్ణ, శివరామిరెడ్డి, ప్రసాద్, మద్దిలేటి, అహమ్మద్ రహిమాన్ స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నంద్యాల మండలంలో..

కానాల, అయ్యలూరు, పెద్దకొట్టాల, కొత్తపల్లె, పోలూరు, పాండురంగాపురం, తదితర గ్రామాల్లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జరుపుకున్నారు. ముందుగా వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కానాలలో పార్టీ నాయకులు ధనుంజయ రెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, నాగన్న, దూదేకుల కాశీం, సర్పంచ్ బావమ్మ, నాయకులు పాల్గొన్నారు. పాండురంగాపురంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తమరెడ్డి, మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరరెడ్డి,దోలావతమ్మ నివాళులర్పించారు.

నంద్యాల పట్టణంలో..

ప్రభుత్వ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైఎస్సార్ చేసిన సేవలను స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధురిగౌడ్, నాయకులు హేమంత్, రాము, శీను పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వైఎస్సార్

బొమ్మలసత్రం: పేదల గుండెల్లో నిలిచిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆదర్శప్రాయుడని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ పరిశీలకురాలు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, నంద్యాల వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ శశికళ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు వైఎస్సార్ 16వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రచార కార్యదర్శి అమృత రాజ్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు రమణ, కారు రవికుమార్, శివ నాగిరెడ్డి, సుబారెడ్డి పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు

గోస్పాడులో...

మండలంలోని యాళ్లూరు గ్రామంలో మంగళవారం వైఎస్సార్ 16వ వర్ధంతిని నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజన్న ఉమ్మడి రాష్ట్ర ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, దేశంలో ఎవరికీ సాధ్యం కాని సంక్షేమ పథకాలను అమలు చేసి పేదలకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. నాయకులు కృష్ణారెడ్డి, నరసింహులు, భాస్కరరెడ్డి, కార్తీక్, ప్రతాప్, సుబ్రమణ్యం, కృష్ణుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడలో మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు



హరివరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్, నాయకులు



కోటపాడులో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కార్యకర్తలు



రుద్రవరంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు



దొర్నిపాడులోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మహానేత.. నిను మరువదు ఈ గడ్డ



ఆళ్లగడ్డలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, నాయకులు

ఆళ్లగడ్డ : మహానేత వైఎస్సార్ వర్ధంతిని నియోజవర్గంలోని వాడవాడలా నిర్వహించారు. దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్‌రెడ్డి స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి వైఎస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల సృష్టికర్త వైఎస్సార్ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆయన ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులైన అందరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సింగం వెంకటేశ్వరరెడ్డి, కేకే, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఏఎస్‌ఆర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

- ఉయ్యాలవాడ : స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో వున్న వైఎస్సార్ విగ్రహానికి, అలాగే హరివరంలో వైఎస్సార్ పాలరాతి విగ్రహానికి, మాయలూరులోని విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్ పోచా రాధాక్రిష్ణారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బండారు వేణు యాదవ్, ఎంపీటీసీ గగ్గెర వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఇల్లూరి వెంకట, ఉప సర్పంచ్ ఎర్రి శ్రీనివాసరెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు దండు మహమ్మద్, నాయకులు ముసాని శివశంకర్‌రెడ్డి, బుడ్డా ఈశ్వరరెడ్డి, దొరవారి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- రుద్రవరం: మండల కేంద్రంతో పాటు నర్సాపురం, ఆలమూరు, చిత్రేనిపల్లె, ఎల్లావత్తుల .శ్రీరంగాపురం, కోటకొండ తదితర గ్రామాల్లో మంగళ వారం దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రసాద రెడ్డి, నాయకులు కొల్లం పుల్లయ్య, హరినారాయణ, ఎంపీపీ బాలస్వామి, మాజీ జెడ్పీటీసీ టీఏ నరసింహారావు(బాబు), సైమన్, లాజర్, లద్దన్న తదితరులు పాల్గొన్నారు.



చాగలమర్రిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- శిరివెళ్ల: మండలంలోని శిరివెళ్ల, వీరారెడ్డిపల్లె, గోవిందపల్లె, వెంకటాపురం, మహదేవపురం, బోయలకుంట్ల, కోటపాడులలోని వైఎస్సార్ విగ్రహాలకు, చిత్ర పటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ. అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, పార్టీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, ఉపాధ్యక్షుడు వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, గురిజాల మాధవరెడ్డి సర్పంచులు మందాల శివారెడ్డి, కందుల మల్లేశ్వరి, జింకల నాగన్న, దూదేకుల గుర్రప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.
- దొర్నిపాడు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బత్తులనాగేశ్వరరావు అన్నారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, నాయకులు శ్రీప్రతి ప్రసాద్, బత్తుల క్రిష్ణయ్య, కాకనూరు మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- చాగలమర్రి: దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక పెద్ద మకానం సెంటర్‌లో ఎంపీపీ వీరభద్రుడు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ షేక్.మహమ్మద్ సోహెల్, ఎంపీటీసీ ఫయాజ్, లక్ష్మిరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్. షబ్బీర్, పార్టీ ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, సర్పంచ్ గోవిందయ్య, మాజీ సర్పంచ్‌లు చంద్రశేఖర్‌రెడ్డి, ఎద్దుల లక్ష్మిరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే ముత్యాలపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి శేషు రమేష్ వైఎస్సార్ విగ్రహనికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప సర్పంచ్ ఓబులేసు, రహిమాన్, సుబ్బరాయుడు, గురప్ప, కదిరి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

- నివారణపై వైద్యులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

గోస్పాడు: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. నంద్యాల సర్వజన ఆసుపత్రి ఆవరణలోని ఎంసీహెచ్ బ్లాక్ సమావేశ భవనంలో మంగళవారం జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కాంతరావునాయక్ ఆధ్వర్యంలో వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీసీడీ 4.0 సర్వేలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే నిర్వహించారని, ప్రస్తుతం జిల్లాలోని 138 మంది వైద్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మొదటి విడతగా 42 మంది వైద్యులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుదర్శన్‌బాబు, ఏఓ డాక్టర్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

నంద్యాల(అర్బన్): పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం బిల్లలాపురం, కొత్తపల్లి గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. కొత్తపల్లె సర్పంచ్ నారాయణ, ఏఈఓ మహేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా అందజేత

నంద్యాల(వ్యవసాయం): మహానంది మండలం గాజులపల్లె ప్రాథమిక ఆదర్శ పాఠశాలకు నంద్యాల రోటరీ క్లబ్ సభ్యులు బీరువాను విరాళంగా మంగళవారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు వివేకానందరెడ్డి మాట్లాడుతూ క్లబ్ సభ్యుడు లక్కాభూషణం రూ.12వేల విలువజేసే బీరువాను అందజేశారని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

ఉయ్యాలవాడ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్వామిత్వ(జాతీయ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కేంద్ర రంగ పథకం) సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని అల్లూరు గ్రామంలో ఈఓపీఆర్డీ నాగలక్ష్మమ్మతో కలిసి సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 20 గ్రామ పంచాయతీలు వుండగా మొదటి విడతగా ఆర్.పాంపల్లె, అల్లూరు, పెద్దయమ్మనూరు గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయడం జరిగిందన్నారు.

రైతు ఉద్యమ నిర్మాత రామకృష్ణ

నంద్యాల(న్యూటౌన్): స్థానిక సీపీఎం కార్యాలయంలో రైతు ఉద్యమ నిర్మాత రామకృష్ణ 8వ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, సీపీఎం సీనియర్ నాయకుడు తోటమద్దులు మాట్లాడుతూ పాములపాడు మండలం లింగాల గ్రామంలోని యుక్త వయస్సులోనే ఆత్మకూరు ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ రైతు, కూలీల, దళితుల, గిరిజనుల భూ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6వ తేదీన చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు, ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. నాయకులు శివకుమార్, సాయి, విజయ్, తేజ పాల్గొన్నారు.

సర్వే పూర్తి చేయండి

శిరివెళ్ల: స్వామిత్వ సర్వే త్వరగా పూర్తి చేయాలని ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొదటి విడతగా కోటపాడు, బోయలకుంట్ల, జీనేపల్లె, యర్రగుంట్ల, గుంప్రమాన్‌దిన్నె పంచాయతీలలో సర్వే జరుగుతుందన్నారు. ఇంత వరకు 6,059 ఇళ్లకు గాను 5400 ఇళ్ల సర్వే పూర్తియిందన్నారు. సర్వేలో ఇంటి కొలతలు, ఖాళీ స్థలం కొలతలు తీసుకుంటున్నామన్నారు. సర్వే పూర్తి కాగానే యజమానికి ఇంటి, స్థలం హక్కు పత్రాలు అందజేస్తామన్నారు. ఈ నెల 4వ తేదీలోగా ఆన్‌లైన్ మ్యాపింగ్ పూర్తి చేయాల్సి ఉందన్నారు.

సమయపాలన పట్టని సచివాలయ ఉద్యోగులు

చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి గ్రామ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించక పోవడంతో వివిధ పనులతో సచివాలయానికి వచ్చి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం ఉదయం 11.00 గంటల వరకు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న 8 మంది సిబ్బందిలో ఏ ఒక్కరూ కూడా హాజరు కాకపోవడంతో సచివాలయం తలుపులు తెరుచుకోలేదు. దీంతో వివిధ అవసరాల నిమిత్తం అక్కడికి వచ్చిన గ్రామ ప్రజలు బయటి నిరీక్షించాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



పోలీసులతో మాట్లాడుతున్న జడ్జి అమ్మన్నరాజ

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 13వ తేదీన జరిగే మెగా జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం కోర్టు ఆవరణలో వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టేషన్ల వారిగా రాజీ అయ్యే కేసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రాజీకాగల కేసులను అవగాహన కల్పించి లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు.లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, సీఐలు అస్రాఫ్ బాషా, కంబగిరిరాముడు, ఈశ్వరయ్య, మల్లికార్జునగుప్తా, ఎస్ఐలు పాల్గొన్నారు.

అహోబిలేశుడి సేవలో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి



స్వామి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

ఆళ్లగడ్డ : అహోబిల లక్ష్మీ నరసింహస్వామి వార్లను వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. అహోబిలం చేరుకున్న ఆమెకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అహోబిలం క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివార్ల శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి వేదశ్వీచనాలు అందించారు.

కల్యాణ మండపం టెండర్ వాయిదా

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ప్రథమనందీశ్వరస్వామి దేవాలయంలోని వైఎస్సార్ కల్యాణ మండపం టెండరు వాయిదా వేశామని ఈఓ రామానుజన్ మంగళవారం తెలిపారు. మండపం నిర్వాహకులు సహదేవయ్య, కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆదేశాల మేరకు యథావిధిగా నిర్వహించుకునే విధంగా తీర్పు వెలువడటంతో టెండర్ వాయిదా వేసినట్లు చెప్పారు. త్వరలో కోర్టు సూచన మేరకు నెల బాడుగ రూపంలో చెల్లింపులపై దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. మిగతా షాపులకు 4వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.